

స్టోరేజ్ ట్యాంక్ నుంచి నీటిని తెచ్చుకుంటూ..

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 6 ఫిబ్రవరి 2024

వేసవి కాదు వేతనం..!

◆ సత్యసాయి నీటి పథకం కార్మికుల సమ్మె ◆ తొమ్మిది ఊళ్లకు తాగునీటి సరఫరా బంద్



ఎన్నెన్ని కష్టాలో..



విడపనకల్లు, ఫిబ్రవరి 5: వేతనాల కోసం సత్యసాయి నీటి పథకం కాంట్రాక్టు కార్మికులు సమ్మె బాట పట్టడంతో జనం నీటికోసం తంటాలు పడుతున్నారు. సుమారు 21 మంది కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. దీంతో వారం నుంచి వారు విధులకు రావడంలేదు. విడపనకల్లు వద్ద ఉన్న సత్యసాయి మంచి నీటి పథకం నుంచి తొమ్మిది గ్రామాలకు తాగు నీరు సరఫరా అవుతుంది. కార్మికుల సమ్మెతో మండల పరిధిలోని మాళాపురం, పెద్ద కొట్టాలపల్లి, వేల్పుమడుగు, జనార్దనపల్లి, ఆర్.కొట్టాల, వి.కొత్తకోట, విడపనకల్లు గ్రామాలు, వజ్రకరూరు మండలంలోని దర్మపురి, చాబాల గ్రామాలకు తాగు నీరు అందడం లేదు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోవటంతో ఆయా గ్రామాల ప్రజలు ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లలో విడపనకల్లు సమీపంలోని సత్యసాయి మంచి నీటి ట్యాంకు వద్దకు వస్తున్నారు. ట్యాంకులోని నీటిని తోడుకు తీసుకువెళుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సుమారు 7 కి.మీ. దూరంలో ఉన్న ట్యాంకు వద్దకు వస్తున్నారంటే.. పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో ఉన్న చేతి పంపులు, బోరుబావులను మరమ్మతు చేస్తే వాడుకునేందుకైనా నీరు దొరుకుతుందని, ప్రభుత్వం పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



పది రోజులుగా సమస్య..

మా ఊరికి పది రోజులుగా తాగునీరు సరఫరా కావడంలేదు. విడపనకల్లుకు వచ్చి నీటిని తీసుకువెళుతున్నాం. రోజూ పొలం పనులను మానుకుని కొందరు, పనులయ్యాక సాయంత్రం కొందరు తాగునీటి కోసం విడపనల్లుకు వస్తున్నాం. నేను రోజూ ద్విచక్రవాహనంలో తాగునీటిని తీసుకువెళుతున్నాను.

- చలపతి, మాళాపురం

సమ్మె ఆగేదాకా సమస్య తీరదు..



అధికారులు పట్టించుకోవడం లేదు..

సత్యసాయి నీటి పథకం కార్మికులకు వేతనాలు ఇవ్వడంలేదు. దీంతో వారు సమ్మె చేస్తున్నారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వారికి వేతనాలు మంజురు చేసి తాగు నీటి సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవటం లేదు. పది రోజులుగా నీరు రావడంలేదు.

- నాగేశ్, విడపనకల్లు

ఓడిపోయేందుకు సిద్ధమా జగన్..?

- డీఎస్సీ అభ్యర్థులపై కేసులు దుర్మార్గం
- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్
- కలెక్టరేట్ ఎదుట డీఎస్సీ అభ్యర్థుల నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చౌక్‌లో నిరసన తెలుపుతున్న డీఎస్సీ అభ్యర్థులు



మాట్లాడుతున్న గేయానంద్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 5: ఎన్నికల్లో ఓడిపోయేందుకు సిద్ధమేనా అని సీఎం జగన్‌ను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ప్రశ్నించారు. డీఎస్సీ పోస్టులకోసం సంవత్సరాల తరబడి వేచిచూస్తున్న నిరుద్యోగులను వంచించారని ఆయన మండిపడ్డారు. తక్కువ పోస్టులతో డీఎస్సీ ప్రకటన విడుదలను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట అభ్యర్థులు సోమవారం ఆందోళనకు దిగారు. రోడ్డు మీద, రీడింగ్ చైర్లలో కూర్చుని చదువుకుంటూ నిరసన తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ హాజరై ప్రసంగించారు. మాట తప్పను, మడమ తిప్పను అంటూనే యువతను జగన్ మళ్లీ మోసగించారని అన్నారు. నిరుద్యోగులకు, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని విమర్శించారు. 25 వేలకు పైగా పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటిస్తామని మాట ఇచ్చిన జగన్.. కేవలం ఆరు వేల పోస్టులను ప్రకటించి మాట తప్పారని అన్నారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా నాడు - నేడు పేరిట ఎన్నివేల కోట్లు ఖర్చు పెడితే ఏమి ప్రయోజనమని ప్రశ్నించారు. జీఓ 117ను రద్దు చేసి, నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా, సిద్ధం.. సిద్ధం అంటూ ప్రచార కార్యక్రమాల్లోనే నిమగ్నమైతే ప్రజలు, నిరుద్యోగుల చేతిలో ఓడిపోవడానికి జగన్ సిద్ధమైనట్లే అని హెచ్చరించారు. డీఎస్సీ పోస్టుల భర్తీని కోరుతూ కలెక్టరేట్‌ను ముట్టడించిన అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచూస్తూ, పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎస్సీ అభ్యర్థులు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించేందుకు వెళ్లగా... తనకు సంబంధం లేదని కలెక్టర్ అన్నారు. తమ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని అభ్యర్థులు కోరడంతో కలెక్టర్ వినతిపత్రాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, నూరుల్లా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఏఐవైఎఫ్ నాయకుడు సంతోష్ పాల్గొన్నారు.

సమస్యలను వదిలి.. దేనికి సిద్ధం..?



సిద్ధం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు

అనంతపురం నగరంలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని కాలనీల్లో ఇంటింటి చెత్త సేకరణ వారానికి రెండుసార్లు కూడా జరగడం లేదు. కొందరు కార్పొరేటర్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందిచడం లేదు. తాగునీటి సరఫరా అధ్వానంగా ఉంది. ముద్దలాపురం ఫిల్టర్ స్టేషన్‌లో 750 హెచ్‌పీ మోటారు కాలిపోయింది. ఇక్కడ మరమ్మతు సాధ్యం కాదని.. బెంగళూరుకు నెల క్రితం తీసుకెళ్లారు. స్టాండ్ బై మోటారును తెస్తే.. అది కూడా 20 రోజుల క్రితం చెడిపోయింది. మెకానిక్ చనిపోయారు, మరమ్మతు చేసేవారు లేరని అంటున్నారు. ఇది చాలదన్నట్లు.. రెండు రోజుల క్రితం రెగ్యులర్ మోటారు చెడిపోయింది. మిగిలిన ఒక మోటారుతో నీటిని అరకొరగా సరఫరా చేస్తున్నారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. నగరం సమస్యల వలయంలో ఉండగా, మేయర్, డిప్యూటీలు, కార్పొరేటర్లు ఎన్నికల ప్రచారం పనులను చూసుకుంటున్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి.. 'సిద్ధం' అంటూ నగరపాలిక కార్యాలయ ఆవరణలో పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. 'అయ్యా.. మళ్లీ సిద్ధమవుదురు.. ముందు సమస్యలపై యుద్ధం చేయండి..' అని నగరవాసులు సూచిస్తున్నారు. అయినా, నగరపాలిక ఏమైనా వైసీపీ కార్యాలయమా..? అక్కడ పార్టీ పోస్టర్లను ఆవిష్కరించడం ఏమిటి..? అని నిలదీస్తున్నారు.

- అనంతపురం క్రైం

వదిలేలా లేరు..!

అసమ్మతి వర్గీయులతో శ్రీనివాసమూర్తి భేటీ

శింగనమల వైసీపీలో కొనసాగుతున్న వేడి

శింగనమల, ఫిబ్రవరి 5: వైసీపీ అసమ్మతి వర్గం లోలోన తన కార్యాచరణను అమలు చేస్తోంది. శింగనమల ఇన్‌చార్జిగా వీరాంజనేయులును ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ వరుస సమావేశాలను నిర్వహిస్తోంది. తాజాగా వీరికి చిత్తూరు జిల్లాకు చెందిన డీఎస్పీ శ్రీనివాసమూర్తి తోడయ్యారు. అసమ్మతిని తనకు అనుకూలంగా మార్చుకుని, టిక్కెట్ రేస్‌లో నిలబడాలని ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో అసమ్మతి నాయకులతో సోమవారం ఆయన భేటీ అయ్యారు. నార్పలలో సత్యనారాయణరెడ్డిని, శింగనమలలో తరిమెల గోకుల్ రెడ్డిని, గార్లదిన్నెలో నారాయణరెడ్డిని ఆయన కలిశారు. పలువురు వైసీపీ కార్యకర్తలను కూడా కలిసి చర్చించారు. త్వరలో సీఎం జగన్ జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఆ సమయంలో అసమ్మతి నాయకులు తమ వాణిని వినిపిస్తామని ఇప్పటికే ప్రకటించారు. డీఎస్పీ శ్రీనివాసమూర్తి వైసీపీ శింగనమల టిక్కెట్‌ను ఆశించారు. రేస్‌లో ఆయన ముందు వరుసలో ఉన్నారన్న ప్రచారం జరిగింది కానీ అనూహ్యంగా ఆలూరు సాంబశివారెడ్డి మనిషి వీరాంజనేయులు తెరపైకి వచ్చారు. దీంతో ఎమ్మెల్యే వ్యతిరేకవర్గీయులు ఏకమై.. వీరాంజనేయులు అభ్యర్థిగా వద్దని, మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసమ్మతి నాయకులతో డీఎస్పీ భేటీ కావడం చర్చనీయాంశం అయ్యింది.



అసమ్మతి నాయకులతో డీఎస్పీ శ్రీనివాసమూర్తి

పప్పు శనగ..!

- దిగుబడి తగ్గినా పెరగని ధరలు
- క్వింటానికి రూ.5,700-5,900 మాత్రమే..
- జిల్లాలో 47 హెక్టార్లలో సాగైన పంట
- కోతలు పూర్తైనా మద్దతు ధర ప్రకటించని ప్రభుత్వం
- దిక్కుతోచక గోదాములలో నిల్వ చేస్తున్నరైతులు



బెళుగుప్పలోని గోదాముల్లో పప్పుశనగ బస్తాలను నిల్వ చేస్తున్న కూలీలు

గోదాములో నిల్వ చేశా



పప్పుశనగకు ఆశించిన ధర లేదు. దీంతో గోదాములో నిల్వ చేశాను. 18 ఎకరాలలో సాగు చేస్తే కేవలం 64 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ సారి దిగుబడులు భారీగా తగ్గినా ధరలు పెరగలేదు. అందుకే ధరలు పెరిగేదాకా వేచి చూద్దామని అనుకుంటున్నాను.

- నరసింహులు, వెంకటాద్రిపల్లి, బెళుగుప్ప మండలం

ఎండిపోయిన పప్పుశనగ పంట



మద్దతు ధర కోసం...



పప్పుశనగ కోతలు పూర్తయినా ఇప్పటి దాకా ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించలేదు. ఎప్పటిలోగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారో అర్థం కావడం లేదు. ఎనిమిది ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశాను. 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. బహిరంగ మార్కెట్ ధరలు ఆశించినంతగా లేకపోవడంతో గోదాములో నిల్వ చేశాను.

- ఉమాపతి, ఎర్రగుడి, బెళుగుప్ప మండలం

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, ఫిబ్రవరి 6

రబీ సీజన్‌లో వర్షాభావంతో పప్పుశనగ పంట దెబ్బతినింది. కొన్నిచోట్ల పంట ఎండిపోగా, మరికొన్ని ప్రాంతాల్లో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. 2023-24 రబీ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 1.23 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో పప్పుశనగ 78 వేల హెక్టార్లు, మిగతా విస్తీర్ణంలో వరి, మొక్కజొన్న, జొన్న, రాగి, పెసలు, ఉలవలు, అలసందలు, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు అవుతాయని అంచనా వేశారు. రకాల పంటలున్నాయి. సీజన్ ఆరంభంలో అరకొర వర్షాలకు 74 వేల హెక్టార్లల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో 47 వేల హెక్టార్లల్లో పప్పుశనగ సాగైంది. మెట్ట పొలాల్లో తగిన సమయంలో వర్షం కురిస్తే.. ఎకరానికి ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్ల శనగ దిగుబడి వస్తుంది. కానీ వర్షాలు కురవక పోవడంతో ఒకటి రెండు క్వింటాళ్లకే దిగుబడి పరిమితమైంది.

మద్దతు ధర ప్రకటించని ప్రభుత్వం

రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధరను ప్రకటించకుండా జాప్యం చేస్తోంది. జిల్లాలోని నల్లరేగడి భూముల్లో పప్పుశనగ కోతలు పది రోజుల క్రితమే పూర్తయ్యాయి. కానీ ఇప్పటి దాకా కనీస మద్దతు ధర గురించి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది మద్దతు ధర క్వింటానికి రూ.5335గా నిర్ణయించారు. బహిరంగ మార్కెట్ ధరల ఆధారంగా మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయిస్తూ వస్తోంది.

పెరగని ధరలు

సాధారణంగా దిగుబడులు తగ్గినప్పుడు ధరలు పెరుగుతాయి. కానీ పప్పుశనగ విషయంలో అందుకు భిన్నంగా ధరలు పడిపోయాయి. ధరల విషయంలో దళారులు కుమ్మక్కై రైతులను దగా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నెల క్రితం క్వింటం పప్పుశనగ ధర రూ.6 వేలు ఉన్నింది. ప్రస్తుతం రూ.5,700 నుంచి రూ.5,900 మధ్య నడుస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. దిగుబడులను గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. గోదాములకు ఆరు నెలలకు క్వింటానికి రూ.75 ప్రకారం అద్దె వసూలు చేస్తున్నారు. ఆరు నెలల తర్వాత క్వింటానికి నెలకు రూ.10 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. మరికొందరు రైతులు అరకొరగా వచ్చిన దిగుబడిని ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. ధరలు పెరగకపోతాయా అన్న ఆశతో రైతులు పంటను విక్రయించకుండా వేచి చూస్తున్నారు.

సార్..! నేను బతికే ఉన్నా

బెళుగుప్ప, ఫిబ్రవరి 5: 'సార్..! నేను బతికే ఉన్నా. వితంతు పింఛన్‌ను రద్దు చేయకుండా ఇవ్వండి' అంటూ మండలంలో హనిమిరెడ్డిపల్లికి చెందిన జ్యోతి వేడుకుంటోంది. తన భర్త మృతి చెందడంతో ప్రభుత్వం ఇచ్చే పింఛన్ తనతో పాటు తన ఇద్దరు పిల్లలకు ఎంతో ఆసరాగా ఉండేదన్నారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో పింఛన్ తొలగించడంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని సోమవారం ఆమె విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. నెల రోజుల కిందట మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి స్పందనలో కూడా అర్జీ ఇచ్చామన్నారు. మొదటిలో రెండు నెలల వితంతు పింఛన్‌ను అందించారు. అనంతరం మీ పేరు చనిపోయిన వారి జాబితాలో ఉందంటూ రద్దు చేశారని బాధితురాలు వాపోయింది. న్యాయం చేయాలంటూ బాధితురాలి తండ్రి వయ్యాలప్ప సోమవారం స్పందనలో ఎంపీడీవో సుబ్బరాజుకు అర్జీ ఇచ్చారు.



స్పందనలో అర్జీ ఇస్తున్న బాధితురాలి తండ్రి



పింఛన్ తొలగించారని వాపోతున్న జ్యోతి

మొగుడు గారు..!



ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన..! ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు వీటిని నిర్వహిస్తారు. కానీ అనంత నగరపాలికలో అధికార పార్టీ నాయకులు కూడా దర్జాగా వీటిని నిర్వహిస్తున్నారు. స్పందన వేదికపై అధికారులతో కలిసి వైసీపీ నాయకులు కూర్చుంటున్నారు. ఈ ఫొటోలో ఉన్న వ్యక్తిని చూడండి..! ఈయన పేరు సాకే కుళ్లాయిస్వామి. వైసీపీకి చెందిన 21వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్రకళ భర్త ఈయన. ఆ హోదాలోనే ఆయన దర్జా ఒలకబోస్తున్నారు. నగరపాలికలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఇద్దరే అధికారులు పాల్గొన్నారు. డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ సంగం శ్రీనివాసులు మాత్రమే హాజరయ్యారు. వీరికితోడు వేదికపై మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఇద్దరు కార్పొరేటర్లు కూర్చున్నారు. ఇక మొగుడుగారు ఉండనే ఉన్నారు. చాలాకాలంగా నగరపాలికలో స్పందనను కమిషన్ నిర్వహించడం లేదు. కిందిస్థాయి అధికారులు మాత్రమే వస్తున్నారు. ఇది క్రమంగా అధికారులను దాటుకుని.. నాయకుల చేతికి వెళుతోంది. దీంతో జనం సమస్యలు పరిష్కారం కావడం అటుంచి, వివాదాలు రెట్టింపు అవుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. కాగా, స్పందనలో కొందరు నగరవాసులు సమస్యలపై ఫిర్యాదు చేశారు. సాయినగర్ ఐదు, ఆరో క్రాస్ చివరన 30 అడుగుల డ్రైన్‌ను 12 అడుగులకు కుదించారని 29వ డివిజన్ కార్పొరేటర్ సైఫుల్లా గతంలో ఫిర్యాదు చేశారు. ఇప్పుడు చవ్వా నారాయణరెడ్డి అనే వ్యక్తి డ్రైన్‌ను మలుపులు తిప్పుతూ, ఎనిమిది అడుగులకు కుదించారని ఫిర్యాదు చేశారు. మురుగు కాలవలను ఆక్రమిస్తే.. వర్షపునీరు ఇళ్లలోకి వస్తుందని, చర్యలు తీసుకోవాలని కోరారు. హోర్డింగ్‌ల ఏర్పాటు, పారిశుధ్య సమస్యలపై అనిల్ కుమార్‌రెడ్డి అనే వ్యక్తి వినతిపత్రం అందజేశారు.

- అనంతపురం క్రైం

డ్రిప్, స్ప్రింక్లర్లపై.. జీఎస్టీనా!



- రైతులపై అదనపు భారం
- నిధుల లేమితో ముందుకురాని కంపెనీలు
- బిందు, తుంపర సేద్యంపై ప్రభుత్వం చిన్నచూపు

కొత్తచెరువు, ఫిబ్రవరి 5: కరువు రైతుపై వస్తు సేవా పన్ను(జీఎస్టీ) భారం మోపుతున్నారు. బిందు, తుంపర(డ్రిప్, స్ప్రింక్లర్) సేద్యం పరికరాల మంజూరు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు(ఏపీఎంఐపీ)కింద రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. 2017 జూలై 1 నుంచి కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జీఎస్టీ కారణంగా గందరగోళం నెలకొంది. జీఎస్టీ భారం నుంచి రైతులకు ఉపశమనం కల్పిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. సూక్ష్మసేద్య పరికరాల విషయాన్ని పొందుపరచకపోవడంతో జీఎస్టీ భారం రైతులపై పడుతోంది. దీంతో రైతు చెల్లించాల్సిన డ్రిప్ పరికరాల రాయితీ (డీడీ)పై 18 శాతం జీఎస్టీ వల్ల అదనపు భారం పడుతోందని వాపోతున్నారు.

కరువు జిల్లాకు డ్రిప్ జీవనాడి

ఉమ్మడి అనంత జిల్లాలో వ్యవసాయం ప్రధాన జీవనాధారం. రైతులు వర్షాభావం కింద వేరుశనగ పంటను సాగుచేస్తారు. వర్షాభావ పరిస్థితుల్లో సాగు చేసిన పంటలు పండక, చేసిన అప్పులు కట్టలేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాభావ పరిస్థితులు, కూలీల కొరత, పెరిగిన సాగు పెట్టుబడులు తదితర కారణాలతో బిందు, తుంపర సేద్యం వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఈ పద్ధతి ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేస్తూ మెరుగైన ఫలితాలు సాధించవచ్చని టీడీపీ హయాంలో ప్రకటించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రం సాయంతో ఏపీఎంఐపీ కింద డ్రిప్ పథకానికి ప్రాధాన్యం ఇచ్చింది. సబ్సిడీపై రైతులకు విరివిగా డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను అందజేసింది. దీంతో రైతులు ఉద్యాన పంటలైన దోస, కర్బూజ, కళింగర పంటలతో పాటు కూరగాయల పంటలను సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ దేశంలోనే అగ్రగామిగా జిల్లాను నిలిపారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న బిందు, తుంపర సేద్యంపై వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు చూడటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. దీంతో రైతులు డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టీడీపీ హయాంలో 48 హెక్టార్లలో..

2014 నుంచి 2019 వరకు ఐదేళ్లలో నిర్దేశిత లక్ష్యాలు సాధించి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 48 వేల హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాలు అందాయి. దాదాపు 52 వేలమంది రైతులకు లబ్ధి చేకూరింది. నిబంధనల ప్రకారం సకాలంలో పరికరాలు సరఫరా చేస్తూ రైతుల పొలాల్లో సంబంధిత డ్రిప్ కంపెనీలు పరికరాలను అమర్చారు. దీంతో రైతులు అధికపంటలు సాగుచేస్తూ దిగుబడులు సాధించారు.

వైసీపీ పాలనలో నామమాత్రమే..

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిందు, తుంపర సేద్యం పథకానికి గ్రహణం పట్టిందని రైతులు వాపోతున్నారు. 2019-2020లో 7490 హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాలను రైతులకు అందించగా తరువాత 2020-21,2021-22లో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కంపెనీలు పరికరాలు సరఫరా చేయలేమని చేతులెత్తేశాయి. దీంతో రెండేళ్లు పూర్తిగా ఆగిపోయింది. ఈ రెండేళ్లలో రైతులు డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డీడీలు కట్టినా పరికరాలు అందక నానా అగచాట్లు పడ్డారు. రైతుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఎట్టకేలకు గత ఏడాది డ్రిప్ కంపెనీలకుప్రభుత్వం బకాయిలు విడుదల చేసింది. 2022-23లో 6674హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాలను సరఫరాచేశాయి. 2023-24కు 7వేల హెక్టార్లకు పరికరాలను అందించాలని లక్ష్యంగా అధికారులు నిర్దేశించారు. అయితే జిల్లాలోని డ్రిప్ కంపెనీలకు పాత బకాయిలు కోట్లలో చెల్లించాల్సి ఉంది. కంపెనీలు సకాలంలో పరికరాలు సరఫరా చేయలేమని చెబుతున్నాయి.

టీడీపీ హయాంలో 90 శాతం సబ్సిడీ

బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో టీడీపీ ప్రభుత్వం 90శాతంసబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందించింది. దరఖాస్తు చేసుకున్నదే తడువుగా అప్పట్లో అధికారులు వెంటనే పరికరాలు అందజేసి సాగుకు సులభతరం చేసేవారు. గత ప్రభుత్వంలో డ్రిప్‌పరికరాల సాయంతో వేలాదిఎకరాలలో పండ్లతోటలు, కూరగాయలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాం.

– సుబ్బరాయుడు, రైతు, కొత్తచెరువు

డ్రిప్ పరికరాలపై జీఎస్టీ భారం

ప్రస్తుతం ఏపీఎంఐపీ కింద రూ.2లక్షలు విలువ చేసే డ్రిప్ పరికరాలు అందిస్తున్నారు. దీని ప్రకారం లక్షకు రూ.18వేలు చొప్పున రూ.2లక్షలకు రూ.36వేలు అదనంగా జీఎస్టీ చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వం భరిస్తున్న 5శాతం మినహాయించిన ఇంకా లక్షకు రూ.13వేలు చొప్పున రూ.2లక్షలకు చెల్లించాల్సి ఉంది. దీంతో డ్రిప్ పరికరాల పొందాలంటే జీఎస్టీ భారం పడుతోంది. రెండున్నర ఎకరాలకు కూరగాయల డ్రిప్‌కు దాదాపు రూ.45వేల నుంచి రూ.60వేల దాకా డీడీ కట్టాల్సి ఉంది. టీడీపీ హయాంలో రూ.20వేల నుంచి రూ.30వేలు చెల్లిస్తే డ్రిప్ పరికరాలు వచ్చేవి. ప్రస్తుతం జీఎస్టీ భారంగా మారింది.

– అశోక్, రైతు,కొత్తచెరువు

9న డీవార్మింగ్ డే

- పిల్లలకు మాత్రలు వేయించండి: కలెక్టర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టరు, జేసీ తదితరులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 5: జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినం సందర్భంగా పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం 9వ తేదీన డీవార్మింగ్ డేను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ఇందుకు సంబంధించి పోస్టర్లను కలెక్టర్, జేసీ, వైద్యాధికారులు ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లలకు నులిపురుగుల నివారణకు మాత్రలు వేయించాలని సూచించారు. జిల్లాలో ఏడాది నుంచి 20 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 1194 ప్రాథమిక, 194 ప్రాథమికోన్నత, 358 ఉన్నత పాఠశాలలు, 26 జూనియర్‌కళాశాలలు, 2302 అంగన్‌వాడీ కేంద్రాలు, డిగ్రీ కళాశాలల్లో 5,64,324 మంది పిల్లలు ఉన్నారన్నారు. వీరందరికీ తప్పకుండా మాత్రలు పంపిణీ చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. జడ్పీ సీఈఓ వైఖోమ్‌నిదియా, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్య భవిష్యత్తును పరిరక్షిద్దాం..

పుట్టపర్తి: పిల్లలు ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం నులిపురుగుల నివారణ కోసం సమష్టి కృషిచేద్దామని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని 9న జరుపుతున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 3,74,171మంది పిల్లలున్నారని డీఎంహెచ్‌ఓ పేర్కొన్నారు. జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

డీఆర్‌ఓగా రామకృష్ణారెడ్డి బాధ్యతలు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 5: జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ)గా రామకృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న డీఆర్‌ఓ గాయత్రీదేవిని డైరెక్టరేట్‌కు బదిలీ చేశారు. ఆమె స్థానంలో కడప జిల్లా రాజంపేట ఆర్డీఓగా ఉన్న రామకృష్ణారెడ్డిని జిల్లాకు ప్రభుత్వం నియమించింది. ఆయన సోమవారం జిల్లాకొచ్చారు. తొలుత కలెక్టరు, జేసీలను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తనచాంబర్‌లో డీఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టారు.

నేటి నుంచి ఎద్దులపల్లి రైల్వేగేట్ మూసివేత

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 5: రైల్వే ట్రాక్ మరమ్మతుల్లో భాగంగా లెవల్ క్రాసింగ్ గేట్ 143 కిలోమీటర్ నెంబర్ 243, 14-16, పామిడి కల్లూరు మధ్యలోని ఎద్దులపల్లి వద్ద ఉన్న గేట్‌ను నాలుగు రోజులపాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 9వ తేదీ వరకు గేట్ మూసివేస్తామన్నారు. మరమ్మతులు పూర్తి కాగానే 10న తెరుస్తామన్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

వైసీపీ కోసం.. వలంటీర్లు..!


తాడిపత్రి పట్టణంలో ఓటరు జాబితాను వెరిఫై చేస్తున్న వలంటీరు

తాడిపత్రి పట్టణంలో ఓటరు జాబితాను పట్టుకుని వలంటీర్లు వీధుల్లో తిరుగుతున్నారు. ఓటరు జాబితా పరిశీలనకు వలంటీర్లను వినియోగించవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశించినా ఖాతరు చేయడం లేదు. పట్టణంలోని టైలర్స్ కాలనీ, పాతకోట, శాస్త్రి నగర్, కేవీ రెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో ఓటరు లిస్టును వలంటీర్లు వెరిఫికేషన్ చేశారు. ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు. ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేయాలని, లేకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలను రావని బెదిరిస్తూ కనిపించారు. కొన్నిప్రాంతాల్లో వలంటీర్లతోపాటు బీఎల్‌ఓలు ఒక ఇంటివద్ద కూర్చొని చుట్టుపక్కల ఇళ్లవారి ఓటరు జాబితాను వెరిఫై చేశారు.

– తాడిపత్రి

నూతన తహసీల్దార్లు వచ్చేశారు..

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 5: ఇతర జిల్లాల నుంచి జిల్లాకు బదిలీ అయిన 39 మంది తహసీల్దార్లు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరు గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి కేటాయించిన మండలాలబదిలీ ఉత్తర్వులను తీసుకున్నారు.

'చలో అసెంబ్లీ' నిర్వహించి తీరుతాం: డేగల

అనంతపురం అర్బన్/శింగనమల ఫిబ్రవరి 5: అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, మంగళవారం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించి తీరుతామని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. సర్పంచుల 16 న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పలు రూపాల్లో ఉద్యమాలు చేశామని, అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో చలో అసెంబ్లీ కార్యక్రమానికి రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిందని అన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడితో పాటు పలు జిల్లాలోని సర్పంచుల సంఘం నాయకులను వైసీపీ ప్రభుత్వం ముందస్తుగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. ఎంతమందిని అక్రమ అరెస్టులు చేసినా చలో అసెంబ్లీని నిర్వహించి తీరుతామన్నారు.

మార్చి 3న కవి సమ్మేళనం

పెనుకొండ, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో నీటి సంక్షోభం, నీటి అవసరాలపై మార్చి 3న సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో జల కవచంపై కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంస్థ కన్వీనర్ హరి తెలిపారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాలలో జలకవచానికి సంబంధించిన బ్రోచర్లను కోకన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కన్వీనర్ హరి, తెలుగు అధ్యాపకుడు రామన్న, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, కోగిర జయచంద్రారెడ్డి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నీటి బాధలు, ఆవేదనలు ప్రజలకు తెలియజేసేందుకే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కవితలు, పాటలు, పద్యాలు వినిపించాలనుకునేవారు ఈనెల 25వ తేదీలోపు 9491355000, 944508510 నెంబర్లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

10 నుంచి నీటి సరఫరా కార్మికుల సమ్మె

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 5: శ్రీరాంరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్ కార్మికులకు 4 నెలల బకాయి వేతనాలు, 15 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కళ్యాణదుర్గం డివిజన్‌లో 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు స్కీమ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ గౌతమిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని కళ్యాణదుర్గం డివిజన్‌లో పనిచేస్తున్న వాటర్ సప్లయ్ కార్మికులకు 4 నెలలుగా వేతనాలు చెల్లించడకపోవడంతో వారి కుటుంబాల జీవనం కష్టతరంగా మారిందన్నారు. ఇదే సమస్యపై గతేడాది డిసెంబరు నెలలో సమ్మె నోటీసు ఇచ్చి 20 రోజులు నిరసనలు తెలపగా జనవరి 30 నాటికి వేతనాలు, పీఎఫ్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, అయినా ఇంతవరకూ హామీని నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, వెంటనే బకాయి వేతనాలు, పీఎఫ్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


గంగిరెడ్డి (ఫైల్)

నల్లమాడ, ఫిబ్రవరి 5: శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం నల్లశింగయ్యగారిపల్లికి చెందిన రైతు గంగిరెడ్డి (68) అప్పుల బాధతో సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గంగిరెడ్డి తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో పప్పుశనగ పంట సాగుచేస్తుండేవాడు. కొన్నేళ్లుగా దిగుబడులు రాక నష్టపోయి, అప్పులపాలయ్యాడు. రూ.3 లక్షల వరకు అప్పులున్నాయి. వాటిని తీర్చే మార్గంలేక గంగిరెడ్డి సోమవారం పొలం వద్దకెళ్లి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు నల్లమాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కదిరికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. రైతుకు భార్య మంగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

యథేచ్ఛగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా

- స్థానికంగా కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు..
- కిలో రూ.15 నుంచి రూ.20 వరకు..
- అనంతలో కీలకంగా ఓ మిల్
- మూలాలను గుర్తించడంలో పోలీసులు విఫలం


పీడీఎస్ బియ్యం వాహనాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 5: రేషన్ బియ్యం అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటుతోంది. చౌకధాన్యపు డిపోల నుంచి పేదలకు అందాల్సిన బియ్యం వ్యాపారంగా మారిపోయింది. కిలోల నుంచి టన్నుల వరకు పెద్ద మొత్తంలో విక్రయిస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా కొనుగోలు చేసి రాష్ట్ర సరిహద్దులను దాటిస్తున్నారు. పీడీఎస్ బియ్యం కిలో రూ.15 నుంచి రూ.20 వరకు డిమాండ్ ఉంది. కొన్ని ప్రాంతాల్లోని రేషన్‌షాపుల్లో బియ్యం సరిగా పంపడం లేదనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో చాలా మంది రేషన్ డీలర్ల నుంచే అక్రమార్కులకు బియ్యం అందుతోందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. సరిహద్దు రాష్ట్రాలైన కర్నాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు బియ్యం సరఫరా అవుతోంది. అడపాదడపా విజిలెన్స్ పోలీసులు అక్రమ రవాణా చేస్తున్న బియ్యాన్ని పట్టుకుంటున్నప్పటికీ సరఫరా మాత్రం ఆగడం లేదు.

కిలో రూ.15 నుంచి రూ.20 వరకు...

చౌకధాన్యపు డిపోల నుంచి పేద ప్రజలకు అందే బియ్యం పక్కదారి పట్టడం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల నుంచి బియ్యం సేకరిస్తుంటారు. గత ఏడాది డిసెంబరు నెలాఖరులో రాప్తాడు మండలం హంపాపురం సమీపంలో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. 630 సంచులతో ఉన్న 320 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈనెల 4న అనంతపురం నగరంలోని తపోవనం సర్కిల్‌లో ఓ వాహనంలో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు 42క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నలుగురిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఒక్కో ప్రాంతంలో డిమాండ్‌ను బట్టి కేజీ బియ్యం రూ.15 నుంచి రూ.20 వరకు కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది ఈ బియ్యాన్ని ఎక్కువగా కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. మరికొంతమంది తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఆయా రాష్ట్రాలలో రూ.25 నుంచి రూ.30లకుపైగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

అనంతపురం పంగల్‌రోడ్డులో కీలకంగా ఓ మిల్

అనంతపురం నగరంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి పీడీఎస్ బియ్యం నేరుగా ఆ మిల్‌కే చేరుకుంటుంది. పదులు, వందల కేజీలు కాదు ఏకంగా వేలటన్నుల్లో బియ్యం చేరుకుంటోందని సమాచారం. నగర శివారులోని పంగల్‌రోడ్డులో ఓ మిల్ ఇందుకు ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇక్కడ ఆ బియ్యాన్ని పాలిష్ చేయించి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమంగా రవాణా చేస్తుంటారు. అక్కడ మంచి ధరకే విక్రయించి బాగానే సొమ్ము చేసుకుంటారని తెలుస్తోంది. ఈనెల మొదటివారంలో పెద్ద మొత్తంలో బియ్యం ఓ ప్రాంతం నుంచి ఆ రైస్‌మిల్ వద్దకు వెళ్తుండగా సెబ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మిల్‌పై గతంలో దాడులు జరిగాయి. కానీ నేటికీ అక్కడ ఈ బియ్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. చాలా సందర్భాల్లో రాత్రి సమయాల్లో పాలిష్ చేస్తుంటారని సమాచారం. ఆ మిల్ నుంచి జిల్లా సరిహద్దు దాటే వాహనాలు నేరుగా వెళ్తాయనే ప్రచారం ఉంది. ఆ స్థాయిలో పోలీసులు, రెవెన్యూ అధికారులు, సిబ్బందికి ముడుపులు అందుతాయని సమాచారం. దీనికి తోడు ఈ అక్రమ వ్యాపారం బయటకు పొక్కకుండా ఉండేందుకు కొన్ని వర్గాలకు సైతం ఆమ్యామ్యాలు అందుతాయట. దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు... ఆ మిల్ నిర్వాహకులకు ఆదాయం ఏస్థాయిలో వస్తోందో. నగరంలో ఆ మిల్‌తో పాటు మరో నలుగురైదుగురు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో కీలకంగా ఉన్నట్లు తెలిసింది.

మూలాలను గుర్తించడంలో విఫలం...

కొన్ని సంవత్సరాల నుంచి పీడీఎస్ బియ్యం రవాణా జరుగుతూనే ఉంది. కొన్ని సందర్భాల్లో బియ్యం పట్టుబడినా, సంబంధిత వారు అరెస్టయినా అక్రమ రవాణా ఆగడం లేదు. దీనికి ప్రధాన కారణం అసలైన మూలాలను పట్టుకోలేకపోవడమేనని తెలుస్తోంది. ఇందులో పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. విజిలెన్స్, సెబ్, పోలీసులు ఇన్ని విభాగాలు దృష్టి సారిస్తున్నా బియ్యం అక్రమ రవాణాను నియంత్రించలేకపోతున్నారు. ప్రతి మండల పరిధిలో ఇద్దరి నుంచి ఐదుగురి వరకు క్షేత్రస్థాయిలో పీడీఎస్ బియ్యం సేకరించి విక్రయిస్తున్నట్లు సమాచారం. వారి నుంచి పెద్ద మొత్తంలో ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసే వారికి సంబంధాలున్నట్లు తెలుస్తోంది. ఎవరెవరు బియ్యాన్ని సేకరించి, అమ్ముతుంటారో పోలీస్‌శాఖకు స్పష్టంగా తెలుసు. కానీ వారందరూ యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నా పట్టించుకోకపోవడానికి ముడుపులు అందుతుండటమే కారణమని తెలుస్తోంది. మరి ఆ పైసలు ముట్టకుండా పోలీసులు ఎప్పుడు నిఘా పెడతారో వేచి చూడాల్సిందే.

పంజాగుట్ట సస్పెండెడ్ సీఐ అరెస్టు

గుంతకల్లు, ఫిబ్రవరి 5: హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ సస్పెండ్ అయిన సీఐ దుర్గారావును అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో తెలంగాణ పోలీసులు సోమవారం అరెస్టు చేసి, హైదరాబాద్‌కు తరలించారు. పంజాగుట్ట స్టేషన్ పరిధిలోని ప్రజాభవన్ వద్ద ఓ కారు బారికేడ్లను ఢీకొట్టింది. ఆ ప్రమాదానికి కారకుడైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సోహైల్‌పై కేసు నమోదు చేయకుండా, కేసును పక్కదారి పట్టించారన్న ఆరోపణపై సీఐ దుర్గారావును సస్పెండ్ చేశారు. గతేడాది డిసెంబరు 23న పోలీసు స్టేషన్ వద్ద ఉన్న బారికేడ్లను సోహైల్ కారుతో ఢీకొట్టాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి తండ్రి షకీల్ పైరవీచేసి సోహైల్ స్థానంలో ఆసిఫ్ అనే వేరే వ్యక్తిని పోలీసులకు అప్పగించి, తన కుమారుడిని విడిపించుకుపోయాడని ఆరోపణలు ఉన్నాయి. సోహైల్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించకపోవడం, కేసును పక్కదారి పట్టించడం తదితర ఆరోపణలు ఎదుర్కొన్న దుర్గారావు, ఉన్నతాధికారుల విచారణ అనంతరం సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆ తరువాత అజ్ఞాతంలో ఉంటూ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీసులు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ఉన్న సీఐ దుర్గారావును అరెస్టు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. దుర్గారావును హైదరాబాద్ వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయానికి విచారణ నిమిత్తం తరలించారని తెలిసింది.

భూమి కోసం రైతు ఆత్మహత్యాయత్నం


రైతు మంజునాథ్

పుట్టపర్తి, ఫిబ్రవరి 5: నా భూమిని మరొకరికి కట్టబెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని, అధికారులు న్యాయం చేయలేదంటూ రైతు మంజునాథ కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. రామగిరి మండలం పుట్టపర్తి గ్రామానికి చెందిన రైతు కలెక్టరేట్‌కు చేరుకుని స్పందన హాల్‌లో డీఆర్‌ఓ కొండయ్యకు వినతిపత్రం అందించారు. నా భూమిని అక్కడ పనిచేస్తున్న వీఆర్‌ఓ ముత్యాలప్ప మరొకరికి బోరువేసుకోవడానికి అనుమతి ఇచ్చాడని, తాను ఎంత అడ్డుకున్నా నీకు హక్కులేదంటూ బెదిరించారన్నారు. సర్వేనంబరు 101-2లో 4.35ఎకరాల భూమి తనకు వారసత్వంగా వచ్చిందని వివరించారు. సమస్య పరిష్కరించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని డీఆర్‌ఓ ముందు వాపోయాడు. ఏం బెదిరిస్తావా అంటూ డీఆర్‌ఓ ఆగ్రహించగా తన బ్యాగులోంచి డీజిల్ బాటిల్ తీసుకుని మీదపోసుకోబోయాడు. అక్కడున్న సిబ్బంది అడ్డుకున్నట్లు మీడియా ప్రతినిధులతో వాపోయాడు. ఈ తంతు చూస్తున్న కలెక్టర్ రైతును పిలిచి మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వెంటనే సర్వేయర్‌ను పిలిచి పరిశీలించాలని ఆదేశించారు. డీజిల్ బాటిల్‌తో లోనికి వస్తే మీరేం చేస్తున్నారంటూ పోలీస్ సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

హత్య కుట్రను భగ్నం చేసిన పోలీసులు


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 5: పట్టణ సమీపంలోని సాయిలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద సోమవారం నాగరాజు అనే వ్యక్తిని హత్యచేయాలనుకున్న కుట్రను పోలీసులు భగ్నం చేసినట్లు డీఎస్పీ గంగయ్య తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఇందుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. గుంతకల్లు మండలం నక్కనదొడ్డి గ్రామానికి చెందిన గోపాలభాస్కర్‌కు ఉరవకొండకు చెందిన వివాహిత సౌభాగ్యతో మూడేళ్లక్రితం ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి ఇరువురు చనువుగా ఉండేవారన్నారు. కొన్ని కారణాలతో భర్త నాగరాజుతో పాటు ముగ్గురు పిల్లలతో కలిసి సౌభాగ్య తాడిపత్రిలో కాపురం పెట్టిందన్నారు. దీంతో సౌభాగ్య, గోపాలభాస్కర్ మధ్య మరింత సాన్నిహిత్యం ఏర్పడిందన్నారు. విషయం తెలుసుకున్న భర్త నాగరాజు భార్యతో తరచూ గొడవపడుతుండేవాడని తెలిపారు. అంతేకాకుండా గోపాలభాస్కర్‌తో కూడా గొడవపడేవాడన్నారు. ఎలాగైనా నాగరాజు అడ్డును తొలగించుకోవాలని భావించిన గోపాలభాస్కర్ కిరాయి మాట్లాడాడు. ఇందుకు అందరూ ససేమిరా అనడంతో చివరికి తానే నాగరాజును అంతమొందించాలని పథకం వేశాడన్నారు. పథకం ప్రకారం నాగరాజు కదలికలను గమనించిన గోపాలభాస్కర్ పట్టణ సమీపంలో ఉన్న సాయిలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద అతనిని హతమార్చాలని వేటకొడవలితో దాడిచేసేందుకు ప్రయత్నించగా అందిన సమాచారం మేరకు సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి సిబ్బందితో కలిసి అడ్డుకొని నిందితుడిని అరెస్టుచేశారని డీఎస్పీ తెలిపారు. సీఐతోపాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

కంకర తోలారు.. వదిలేశారు..!

● గోవిందరాయునిపేట రోడ్డు దుస్థితి ● బిల్లులు రాకపోవడంతో చేతులెత్తేసిన కాంట్రాక్టర్
● రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు ● ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని పాలకులు



గోవిందరాయునిపేట రోడ్డు దుస్థితి

శింగనమల, ఫిబ్రవరి 5: శింగనమల పంచాయతీలోని గోవిందరాయునిపేటకు వైసీపీ ప్రభుత్వం రోడ్డు మంజూరు చేసింది. రెండేళ్ల క్రితం కాంట్రాక్టర్ ఆ పనులను ప్రారంభించాడు. కంకర తోలాడు. అయితే అంతవరకు జరిగిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఆ కాంట్రాక్టర్ చెతులెత్తేశాడు. దీంతో ఆ పనులు అక్కడితో ఆగిపోయాయి. రోడ్డుపై కంకర వేసి ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలు జారి పడుతుండటంతో అనేక మంది తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల పాలయ్యారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'స్పందన'కు 364 ఫిర్యాదులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 5: కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి స్పందనకు మొత్తం 364 ఫిర్యాదులు అందాయి. వాటిని కలెక్టరు గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, జడ్పీసీఈ, వైఖోమ్ నిదియా, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు నీలమయ్య, ఆనంద్ రవీంద్ర బాధితుల నుంచి స్వీకరించారు. ఆ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించినపుడే మనపై వారికి గౌరవం, నమ్మకం ఉంటుందని, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయరాదని అధికారులకు కలెక్టరు సూచించారు.

కేంద్ర పథకాలను అడ్డుకొంటున్న వైసీపీ

అనంతపురం సెంట్రల్ : ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ప్రజలకు చేరువకాకుండా అడ్డుకుంటున్నారని, ఇందులో భాగంగా విశ్వకర్మ పథకాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర మండిపడ్డారు. విశ్వకర్మ పథకాన్ని అమలుచేయాలని సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు స్పందనలో అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాసులు, అశోక్, శివరుద్ర, గణేష్, శ్రీరాములు, ప్రదీప్ పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలివ్వాలి

అనంతపురంరూరల్: మండలంలోని కురుగుంట గ్రామంలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని జై భీమ్ భారత్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం ఇచ్చారు.

పంటనష్టపరిహారం ఇవ్వాలి

గార్లదిన్నె : పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం, సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వినతి పత్రాన్ని డిప్యూటి తహసీల్దార్ మల్లికార్జునకు అందచేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాగమ్మ, నల్లప్ప, రాము, రమీజా, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సొసైటీల కంప్యూటరీకరణతో అక్రమాలకు చెక్

అనంతపురం క్లాకటవర్, ఫిబ్రవరి 5: సొసైటీల కంప్యూటరీకరణతో అక్రమాలకు చెక్ పెట్టొచ్చని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ సహకార భవన్‌లోని ఏడీసీసీ బ్యాంకులో డీసీఏఓ నాగరాజు, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ రాంప్రసాద్‌తో సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియపై ఆయన చర్చించారు. ఉమ్మడి జిల్లాలో 115 సొసైటీలు ఉండగా, మొదటి విడతలో 50 సొసైటీల్లో ఆన్‌లైన్ అమలు చేస్తామన్నారు. జిల్లా స్థాయి కమిటీలో చర్చించి త్వరలో కంప్యూటరీకరణ చేస్తామన్నారు. ఇప్పటికే పలుమార్లు సొసైటీల కంప్యూటరీకరణ వాయిదా పడిందని, మార్చిలోపు జిల్లాలోని 57 సొసైటీల్లో కచ్చితంగా అమలు చేయాలని నిర్ణయించామని అన్నారు. ఆప్కాబ్, నాబార్డుల సహకారంతో సొసైటీల్లోని అన్ని రికార్డులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని, తద్వారా అక్రమాలకు చెక్ పెట్టొచ్చని అన్నారు. బినామీ, నకిలీ పట్టాలను అరికట్టి, అర్హులైన రైతులకు పంట రుణాలు అందజేసే అవకాశం ఉంటుందన్నారు. ఇక ఆన్‌లైన్ ప్రవేశపెట్టి ఇంట్లో నుంచే రైతులు, ఖాతాదారులు పారదర్శకమైన సేవలు పొందవచ్చన్నారు.

ఏపీ ఈసెట్ కన్వీనర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ భానుమూర్తి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 5: ఏపీ ఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ భానుమూర్తి జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసి ఈసెట్ ప్రత్యేక కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను వీసీ శ్రీనివాసరాజు, రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్ అభినందించారు. వీసీ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరం ప్రవేశాలను కల్పించేందుకు ఈసెట్ ద్వారా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి జేఎన్‌టీయూకు కేటాయించడం హర్షణీయమన్నారు. గత రెండు సంవత్సరాలు ఏపీఈసెట్‌ని నిర్వహించా మన్నారు. అనంతరం ఈసెట్ నిర్వహణ ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో పలువురు డైరెక్టర్లు, వీర్వో మారాల రామశేఖర్‌రెడ్డి, డీఆర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 5: వార్డు శానిటేషన్ కార్యదర్శులు విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని నగర కమిషనర్ మేఘస్వరూప్ హెచ్చరించారు. సోమవారం ఉదయం నగరంలోని అరవింద్‌నగర్, ఆదర్శకాలనీ, హమాలీ కాలనీ, నవోదయకాలనీ, కలెక్టరేట్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. శానిటేషన్ కార్యదర్శులు వేకువజామునే విధులకు హాజరై పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. పర్యవేక్షణకు హాజరుకాని 45, 46, 48 వార్డు శానిటేషన్ కార్యదర్శులకు నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులును ఆదేశించారు.

టీకాలను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 5: ఉమ్మడి జిల్లాలో గొర్రెలు, మేకల యజమానులు ఉచిత పీపీఆర్ నిరోధక టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రామచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో 27,09,394, సత్యసాయి జిల్లాలో 31,01,379 గొర్రెలు, మేకలున్నాయన్నారు. అనంతజిల్లాలో 1,56,144, సత్యసాయిలో 62,054 గొర్రెలు, మేకలకు ఈ టీకాలు వేశామన్నారు. మిగతా వాటికి త్వరలోనే టీకాలు వేస్తామన్నారు.

అటవీ స్థలాలను కాపాడుకుందాం: సీసీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న సీసీఎఫ్ నాగేశ్వరరావు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 5: సర్కిల్ పరిధిలోని అటవీ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) నాగేశ్వరరావు డీఎఫ్ఓలకు సూచించారు. సోమవారం సీసీఎఫ్ కార్యాలయంలోని తమ చాంబర్‌లో అనంతపురం సర్కిల్ పరిధిలోని డీఎఫ్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ స్థలాలను ఏట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు అప్పగించడానికి వీలులేదన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నగర వనాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో అనంతపురం డీఎఫ్ఓ వినీత్ కుమార్, సత్యసాయి జిల్లా డీఎఫ్ఓ రవీంద్రనాథ్‌రెడ్డి, సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ శ్యామల, చిత్తూరు డీఎఫ్ఓ చైతన్య కుమార్, చిత్తూరు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ సోమశేఖరం, వీలేరు స్క్వాడ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డి, పలమనేరు సబ్‌డీఎఫ్ఓ వేణుగోపాల్, పెనుకొండ సబ్‌డీఎఫ్ఓ ఆనంద్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 5: స్థానిక 26వ డివిజన్‌లో తెలుగు దేశం పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి సోమవారం ప్రారంభించారు. టీడీపీ అధికారంలోకి రాగానే భూగర్భ డ్రైనేజీని నిర్మిస్తామని, డంపింగ్ యార్డును తరలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 26వ డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని వేణుగోపాల్, నాయకులు తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళీ, గాజుల ఆదెన్న, సరిపూటి రమణ, మారుతీకుమార్ గౌడ్, సుధాకర్ యాదవ్, గోపాల్ గౌడ్, అజీజ్, మార్కెట్ మహేష్, బాలప్ప, ముక్తియార్, పోతుల లక్ష్మీనరసింహులు, జేఎం బాషా, పరమేష్, గోళ్ల సుధాకర్ నాయుడు, వన్నూరు,కడియాల కొండన్న, మనోహర్, తెలుగు మహిళలు విజయశ్రీరెడ్డి, సంగా తేజస్విని, కృష్ణవేణి, వసుంధర పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పేరుతో డబ్బు వసూళ్లను అడ్డుకోండి



ధర్నాలో నినాదాలు చేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 5: ఇంటర్ ప్రాక్టికల్స్ కోసం డబ్బులు వసూళ్లు చేసిన కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్ఐఓ కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్ఐఓ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడారు. ఇంటర్ ప్రాక్టికల్స్ కోసం పలు కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ప్రాక్టికల్స్‌లో మార్కులు ఎక్కువ వేయిస్తా మంటూ భారీగా డబ్బులు దండుకుంటున్నాయన్నారు. డబ్బులు ఇవ్వలేని విద్యార్థులను మానసికంగా, నైతికంగా ఒత్తి డికి గురయ్యేలా యాజమాన్యాలు చేస్తున్నా యని మండి పడ్డారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.... సమస్య పరిష్కారం కాలేదని, ఇప్పటికైనా అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు హనుమంతరాయుడు, వంశీ, ఉమామహేష్, మంజు, ఆనంద్, హరికృష్ణ, విశ్వ శివ, భీమేష్, సోము పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలి: రైతు సంఘం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 5: అన్ని రకాలుగా నష్టపోయి.... రుణభారంతో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రంలోని రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ.... అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో చివరి బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా.... రైతు రుణ మాఫీ అంశాన్ని చేర్చాలని, రైతులను ఆదుకోవాలని కోరారు. అన్నదాతల ఆత్మహత్యల్లో దేశంలోనే రాష్ట్రం రెండో స్థానంలో, అప్పుల్లో మూడో స్థానంలో ఉందన్నారు. గత నెల సంక్రాంతి పండుగకే బాధిత రైతులకు నష్టపరిహారం ఇస్తామన్న జగన్.... శివరాత్రి పండుగ వస్తున్నా పరిహారం ఊసే ఎత్తడం లేదన్నారు. రైతులపై జగన్ సానుకూలంగా స్పందిం చాలని, లేకుంటే రానున్న ఎన్నికల్లో రైతులు ఓటుతో బుద్ధిచెప్పడానికి సిద్ధంగా ఉన్నార న్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప, ఆర్గనైజింగ్ కార్యదర్శి వన్నారెడ్డి, కోశాధికారి రామకృష్ణ, ఇతర నాయకులు వెంకట్రాముడు నీళ్లపాల రామకృష్ణ, రమేష్, నగేష్, పోతన్న దుర్గాప్రసాద్, నాగభూషణ, రెడ్డప్ప, మహేంద్ర, పాండు, వేణు, వెంకటేష్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

స్టార్టర్ పెట్టె, వ్యవసాయ పరికరాల చోరీ

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 5: కనగానపల్లి మండలంలోని చంద్రాచెర్ల గ్రామంలో ఆదివారం రాత్రి రైతు ముత్యాలు పొలంలో స్టార్టర్‌పెట్టె, వ్యవసాయపరికరాలు చోరీ అయ్యాయి. సోమవారం ఉదయాన్నే పొలానికి వెళ్లిన ముత్యాలు తన పొలంలోని దాదాపు రూ. 25 వేల విలువైన స్టార్టర్‌పెట్టె, వ్యవసాయ పరికరాలు డ్రిప్పు, పైపులు చోరీకి గురైనట్లు గుర్తించాడు.

సీపీఐ గ్రామ కమిటీ ఏర్పాటు

శింగనమల, ఫిబ్రవరి 5: మండలంలోని చిలేపల్లి గ్రామంలో గ్రామకమిటీని ఏర్పాటు చేసిన సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి నారాయణస్వామి తెలిపారు. సోమవారం గ్రామంలో సీపీఐ కార్యకర్తల సమావేశం నిర్వహించి గ్రామ కమిటీని నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో నేసే మధు, దబ్బన, నారప్ప పాల్గొన్నారు.

నగరవనం తనిఖీ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 5: అనంతపురం రేంజ్ పరిధిలోని పంపనూరు సమీపంలో ఉన్న నగరవనాన్ని రేంజర్ శ్రీనివాసులు సోమవారం తనిఖీ చేశారు. ప్రస్తుతం నెలకొన్న తీవ్ర వర్షాబావ పరిస్థితులు, నీటి సమస్యతో ఆ వనం దయనీయంగా మారింది. సోమవారం అక్కడి వెళ్లిన రేంజర్... నగరవనంలోని మొక్కలు, చెట్లకు డ్రిప్ ద్వారా నీటిని సరఫరా చేసేలా సంబంధిత సిబ్బందితో చర్చించారు.

రైల్వే తపాలా కార్యాలయం మార్పు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 5: స్థానిక రైల్వే స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా 4వ ప్లాట్‌ఫాంలో ఉన్న రైల్వే తపాలా కార్యాలయాన్ని ఒకటో ప్లాట్‌ఫాంకు మార్చినట్లు స్టేషన్ మాస్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఇక నుంచి రైల్వే తపాలా సేవలు ఒకటో ప్లాట్‌ఫాం నుంచే అందిస్తామన్నారు. వినియోగదారులు ఈ మార్పును గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

వైసీపీకి సింగిల్ డిజిట్టే : కాలవ

రాయదుర్గం, ఫిబ్రవరి 5: రానున్న ఎన్నికల్లో వైసీపీ సింగిల్ డిజిట్‌కే పరిమితం కానుందని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సోమవారం స్పష్టం చేశారు. పట్టణంలోని 7, 8 వార్డులలో ఉన్న చేనేత వర్గాల ప్రముఖుల ఇళ్లకు వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా తెలుగు దేశం పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1994లోని తెలుగుదేశం ప్రభంజనం 2024లో కూడా పునరావృతం కానుందని తెలిపారు. ఎక్కడికెళ్లినా సానుకూలత వ్యక్తమవుతుంద న్నారు. రాయదుర్గం బాగు కోసం తాను గెలవాలని ప్రజలు ఆశీర్వదిస్తున్నారన్నారు. అత్యంత వెనుకబడిన రాయదుర్గంలో గతంలో ప్రారంభించి న పనులన్నింటిని పూర్తి చేయడంతో పాటు మరిన్ని అభి వృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్య క్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ముదిగల్లు జ్యోతి, టంకశాల హనుమంతు, కడ్డిపూడి మహబూబ్ బాషా, హనుమంతరెడ్డి, పూజారి తిప్పయ్య, శివ పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 5: అనంతపురం అర్బన్ తహసీల్దార్‌గా శివరామిరెడ్డి, రూరల్ మండల తహసీల్దార్‌గా టీవీ సుబ్రమణ్యంనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

శింగనమల: కడప జిల్లా రైల్వే కొండాపురం నుంచి బదిలీపై వచ్చిన శోభన్‌బాబు శింగనమల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఈశ్వరమ్మ అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు.

గార్లదిన్నె: తిరుపతి నుంచి బదిలీపై వచ్చిన లోకేశ్వరీ గార్లదిన్నె తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి తహసీల్దార్ ఉషారాణి తిరుపతి బదిలీ అయ్యారు.

సీఐ, ఎస్‌ఐలు....

రాప్తాడు : రాప్తాడు పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్ అనంతరం మొట్టమొదటి సీఐగా మునిస్వామిని నియమించారు. చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన ఆయన సోమవారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.

గార్లదిన్నె:తాడిపత్రి రూరల్ ఎస్ఐ మహమ్మద్‌గౌస్ గార్లదిన్నె ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఎస్ఐ సాగర్ తాడిపత్రికి బదిలీ అయ్యారు.

ధర్మవరంరూరల్: కనగానపల్లి ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఓడీసీ మండలంలో పనిచేస్తున్న ఆయన బదిలీ ఇక్కడి వచ్చారు.

జగన్‌రెడ్డికి చెక్ పెడదాం



కుంటిమద్దిలో మాట్లాడుతున్న కుంటిమద్ది రంగయ్య

రామగిరి, ఫిబ్రవరి 5: రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు చెక్ పెట్టి.. చంద్రబాబునాయుడును సీఎంగా చేసుకుందామని టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య పిలుపునిచ్చారు. గంతిమర్రి, కుంటిమద్దిలో సోమవారం సాధికార సారధులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్‌లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అజెండాను, మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, మాజీ ఎంపీపీ పరందామ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, తెలుగు యువత అధ్యక్షుడు లింగాశ్రీధర్‌నాయుడు, నాయకులు సుబ్బరాయుడు, సుకన్య, ఈశ్వరయ్య, అక్కులప్ప, బాలరాజు, మాదవరెడ్డి, నారాయణస్వామి, కొండారెడ్డి, వడ్డివెంకటేశ్, చంద్రాయుడు, ఆనంద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 5: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు రోడ్డు భద్రతా, గుడ్ సమారిటన్ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అనంతపురం ఆర్టీఓ సురేష్‌నాయుడు మాట్లాడుతూ... గ్రామాల్లో గాయపడిన వ్యక్తులను ప్రమాదం జరిగిన గంటలోపు సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించడం ద్వారా బతికే అవకాశాలున్నాయన్నారు. ఆస్పత్రిలో చేర్పించిన వారికి పోలీసుల నుంచి ఎలాంటి వేధింపులు ఉండవని, కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరమూ లేదని అన్నారు. అంతేకాకుండా గాయపడిన వారిని ఆస్పత్రిలో చేర్పించిన వారికి కేంద్ర ప్రభుత్వం రూ.5వేలు నగదు బహుమతి, ప్రోత్సాహక సర్టిఫికెట్ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ శ్రీనివాసులు, సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు మోదీ ఊడిగం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 5: ప్రధానిగా ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేయాల్సిన నరేంద్రమోదీ.. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు వేమన మండిపడ్డారు. దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ పదేళ్ల పాలనపై యంగ్ ఇండియా రెఫరెండం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఎస్కేయూలో యంగ్ ఇండియా రెఫరెండం నిర్వహణ పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. ఉన్నత విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసి పరిశోధన విద్యను అటకెక్కించారని మండిపడ్డారు. ఈ అంశాలపై ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న రెఫరెండం సదస్సులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వంశీకృష్ణ, రాజునాయక్ పాల్గొన్నారు.

సెలవులో డీఎల్‌పీఓ సుమన జయంతి

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 5: అనంతపురం డివిజనల్ పంచాయతీ అధికారి సుమన జయంతి నెలరోజుల పాటు సెలవులో వెళ్లారు. ఆ స్థానంలో సీనియర్ ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డిని నియమించే అవకాశముంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఫైల్ డీపీఓ కార్యాలయం నుంచి కలెక్టర్ వద్దకు చేరింది. కలెక్టర్ ఆమోదం వెంటనే దామోదర్‌రెడ్డి ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరిస్తారు. సాధారణంగా నెలరోజులు రెగ్యులర్ డీఎల్‌పీఓ సెలవులో వెళ్తే... డీపీఓ, డీఎల్‌పీఓ కార్యాలయాల్లోని ఏఓలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తారు. అయితే ఏఓలకు కార్యాలయాల్లోనే ఎక్కువ పని ఉంటుంది. దీంతో కొన్ని సమస్యలు తలెత్తే అవకాశముంది. ఇలాంటి సందర్భంలో ఫీల్డ్ విజిట్‌లో ఉండే ఈఓఆర్డీకి బాధ్యతలు అప్పగిస్తే ఎలాంటి సమస్యలూ ఉండబోవని ఆలోచనలో డీపీఓ ప్రభాకర్‌రావు ఉన్నట్లు సమాచారం. దీంతో సీనియర్ ఈఓఆర్డీ అయిన దామోదర్‌రెడ్డి ఇప్పటికే ఆత్మకూరు రెగ్యులర్ ఈఓఆర్డీతో పాటు అనంతపురం ఇన్‌చార్జ్ ఈఓఆర్డీగా కూడా ఉన్నారు. దీంతో ఆయనకే బాధ్యతలు అప్పగించే అవకాశం సమాచారం.

ఏఐఎస్ఎఫ్ టెన్త్ మోడల్ పేపర్ల విడుదల

అనంతపురం విద్య, ఫిబ్రవరి 5 : పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో టెన్త్ మోడల్ పేపర్లు విడుదల చేశారు. సోమవారం నాల్గవ రోడ్డులోని నేతాజీ చంద్రబోస్ హై స్కూల్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహా, జిల్లా కార్యదర్శి అబ్దుల్ ఆలం ఆధ్వర్యంలో ఆ మోడల్ ప్రశ్నాపత్రాల విడుదల చేశారు. స్కూల్ హెచ్ఎం ప్రకాష్, అసిస్టెంట్ ఏఎంఓ చంద్రమోహన్‌రెడ్డి, ఆర్ట్స్ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ రంగస్వామి, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్ సమక్షంలో ఆ పేపర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేతలు ప్రతిభ భారతి, సుమాంజలి, పవన్ కళ్యాణ్, గణేష్, ధర్మేష్ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

ఆత్మకూరు, ఫిబ్రవరి 5: ప్రమాదాల్లో గాయపడి అనంతపురం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న టీడీపీ మండల కార్యాకర్తలను మండల ఇన్‌చార్జి బాలాజి, మండల కన్వీనర్ శ్రీనివాసులు సోమవారం పరామర్శించారు. టీడీపీ మండల నాయకుడు కందుల ఓబులపతి కుమారుడు అభి, ముట్టాల గ్రామానికి చెందిన వేణును వారు పరామర్శించారు.



మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరిన అనంతపురం రూరల్ మండలంలోని వైసీపీ శ్రేణులు

వైసీపీ నుంచి టీడీపీలోకి..

అనంతపురంరూరల్/ధర్మవరంరూరల్: అనంతపురంరూరల్ మండలంలోని చిన్నంపల్లి, కురుగుంట ప్రాంతాలు, కనగానపల్లి మండలంలోని పలువురు వైసీపీ శ్రేణులు టీడీపీలోకి చేరారు. సోమవారం అనంతపురంలోని మాజీ పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో ఆమె సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.



టీడీపీలోకి చేరిన కనగానపల్లి మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు

డిజిటల్ కరెన్సీతో గ్లోబల్ రిలేషన్స్

ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 5: డిజిటల్ కరెన్సీ వినియోగంతో గ్లోబల్ రిలేషన్స్ మెరుగుపడుతాయని ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... యూపీఐ ప్లాట్‌ఫాం ద్వారా ఫోన్‌పే, గూగుల్, పీటీఎం తదితర వాటి ద్వారా నగదు బదిలీలు చేస్తున్నామన్నారు. అయితే గ్రామస్థాయిలో ఇంకా వీటి వినియోగం పెరగాల్సి ఉందన్నారు. అదే సమయంలో ఆర్థిక రంగంలో లోటుపాట్లను సరిద్దాల్సిన అవసరమూ ఉందన్నారు. ఈ అంశాలపై లోతుగా చర్చించి తగిన చర్యలు చేపట్టేందుకు మార్చి 22న ఐసీఎస్ఎస్ఆర్ సౌజన్యంతో కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో జాతీయ సదస్సును నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్యతో కలిసి ఆ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ వీసీ, రిజిస్ట్రార్

పల్లెకు పోదాంను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నందిరెడ్డి శ్రీనివాసులు

శింగనమల, ఫిబ్రవరి 5: దేశంవ్యాప్తంగా బీజేపీ చేపట్టిన పల్లెకు పోదాం అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం శింగనమలలో నిర్వహించిన పల్లెకు పోదాం అభియాన్ శిక్షావర్గ అంసెబ్లీ ఎన్నికల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో పేదలకు సంక్షేమం.. మహిళలకు సాధికారత కోసం ఈ కార్యక్రమాన్ని ప్రవేశం పెట్టారని, దీనిపై గ్రామీణులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రవిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివనారాయణ, సీనియర్ నాయకుడు చిరంజీవిరెడ్డి, సాకే శివశంకర్, కోనంక శ్రీధర్, లలిత్ కుమార్, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

గాయత్రీ కాలేజ్‌పై చర్యలు తీసుకోవాలి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 5: విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యేలా చేసిన గాయత్రీ జూనియర్ కాలేజ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఆర్‌వైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయా సంఘాల నాయకులు కాలేజ్ వద్ద ధర్నా చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేమన్న, ఆర్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ మల్లికార్జున మాట్లాడుతూ.... సుమారు 50 మంది వరకూ విద్యార్థులు దగ్గు, అలర్జీ లక్షణాలతో జిల్లా ప్రభుత్వాసుపత్రికి వచ్చారన్నారు. విద్యార్థులే స్వయంగా ఆసుపత్రికి రావడం, వారే చికిత్స చేయించుకోవడం శోచనీయమన్నారు. కళాశాల యాజమాన్యం లక్షలాది రూపాయలు ఫీజులు దండుకుని, అనారోగ్యంపాలైన విద్యార్థులను ఇలా వదిలేయడం దుర్మార్గమన్నారు. యాజమాన్యంపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రామన్న, కృష్ణ, ఇస్మాయిల్, హుస్సేన్ పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తదితరులు

వైసీపీకి సింగిల్ డిజిట్టే : కాలవ

రాయదుర్గం, ఫిబ్రవరి 5: రానున్న ఎన్నికల్లో వైసీపీ సింగిల్ డిజిట్కే పరిమితం కానుందని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సోమవారం స్పష్టం చేశారు. పట్టణంలోని 7, 8 వార్డులలో ఉన్న చేనేత వర్గాల ప్రముఖుల ఇళ్లకు వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1994లోని తెలుగుదేశం ప్రభంజనం 2024లో కూడా పునరావృతం కానుందని తెలిపారు. ఎక్కడికెళ్లినా సానుకూలత వ్యక్తమవుతుంద న్నారు. రాయదుర్గం బాగు కోసం తాను గెలవాలని ప్రజలు ఆశీర్వదిస్తున్నారన్నారు. అత్యంత వెనుకబడిన రాయదుర్గంలో గతంలో ప్రారంభించిన పనులన్నింటిని పూర్తి చేయడంతో పాటు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ముదిగల్లు జ్యోతి, టంకశాల హనుమంతు, కడ్డిపూడి మహబూబ్‌బాషా, హనుమంతరెడ్డి, పూజారి తిప్పయ్య, శివ పాల్గొన్నారు.

తాగునీటి పథకాలపై వైసీపీ నిర్లక్ష్యం

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి రక్షిత తాగునీటిని అందించాలన్న తమ సంకల్పం వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నేటికీ నెరవేరలేదని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తన 50 వారాల సెల్ఫీ చాలెంజీలో భాగంగా డీ.హీరేహాళ్ మండలం ఓబుళాపురం గ్రామంలో టీడీపీ హయాంలో భూమిపూజ చేసినా ఇంటింటికి కొళాయి పథకం వద్ద సోమవారం ఆయన 43వ సెల్ఫీ దిగారు. పల్లెల్లో ప్రతి ఇంటికి సురక్షిత నీటిని అందించేందుకు రూ.191 కోట్లతో ఈ పథకాన్ని టీడీపీ హయాంలో మొదలు పెట్టామన్నారు. అప్పట్లో పంచాయతీ రాజ్‌శాఖ మంత్రిగా ఉన్న లోకేశ్ అనంతపురం జిల్లాలో ఎంపిక చేసిన నియోజకవర్గాలకు రూ. 1900 కోట్లు మంజూరు చేశారన్నారు. గ్రామాల్లో బడుగు, బలహీన వర్గాల వారికి సురక్షిత నీటిని అందించాలన్న శ్రద్ధ వైసీపీ ప్రభుత్వానికి లేదన్నారు. ఈ ఏడాది వేసవి రాకముందే గ్రామాల్లో తాగునీటి సమస్య తాండవిస్తోందన్నారు. నిర్వహణ లోపం వల్ల ఉన్న నీటి పథకాలు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. తాను రెండో సారి ఎమ్మెల్యేగా గెలిచి ఉంటే ఈ పథకాన్ని పూర్తి చేసేవాడినన్నారు. రాబోవు సాధారణ ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి గెలుపు తథ్యమన్నారు. ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాలు తిరిగి పూర్తి చేస్తామని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు.

ప్రజలే నా దమ్ము, ధైర్యం: జేసీపీఆర్



జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

యాడికి, ఫిబ్రవరి5: ప్రజలే నా దమ్ము, ధైర్యమని వారి అండ దండలతోనే తాము ఈ స్థాయికి ఎదిగామని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. యువచైతన్య బస్సుయాత్రలో భాగంగా సోమవారం మండలంలోని పెద్దపేట, పిన్నేపల్లి, చంద్రాయునిపల్లి, గుడిసెలు, కత్తిమానుపల్లి, ఓబులాపురం, కోనుప్పల పాడు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో గ్రామస్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువచైతన్య బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ వస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు సైకో పాలనలో రాష్ట్రంలో అక్రమకేసులు, దౌర్జన్యాలు, అన్యాయాలు తప్ప మరి ఏమి లేవని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, మాదాల అనిల్, కంబగిరిరాముడు, సూర్యనారాయణ, నరసింహులు, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, రామాంజనేయులు, ఆదినారాయణ, తిరంపురం నీలకంఠ, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్, గోపాల్‌నాయుడు, త్రినాథ్‌రెడ్డి, బాలాంజనేయులు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కత్తిమానుపల్లి గ్రామానికి చెందిన 25మంది వైసీపీ కార్యకర్తలు చవ్వా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కంభం పుల్లారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కేశవరెడ్డి, హను మంతరెడ్డి, తిమ్మారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, చిన్నఓబులయ్య ఉన్నారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి: ఉమా



సమావేశంలో మాట్లాడుతున్న ఉమా మహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 5: వైసీపీకి ఓటుతో బుద్ధి చెబుదామంటూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు తెలిపారు. సోమవారం టీడీపీ క్యాంప్ కార్యాలయంలో నా మొదటి ఓటు చంద్రబాబుకి కార్యక్రమాన్ని నియోజకవర్గ తెలుగు మహిళ, ఐటీడీపీ, తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ సభ్యులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి భర్తీ చేస్తామన్న రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నాణ్యతలేని విద్య, ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రాన్ని 20 సంవత్సరాలు వెనక్కి నెట్టాడన్నారు. ఈ విషయాన్ని యువ ఓటర్లకు తెలియజేయాలన్నారు. తెలుగుదేశం పార్టీని గెలిపించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుని చేసుకుంటే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించవచ్చన్న సందేశాన్ని వినిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దొడగట్ట నారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ తలారీ సత్యప్ప, రాష్ట్ర తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి బిక్కి రామలక్ష్మి, పట్టణ ప్రధాన కార్యదర్శి గోవింద రాజులు, రమాదేవి, ఐటీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదిమూలం, మహారాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి విరుపాక్షి, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు మహేంద్ర, కురుబ కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనను అంతం చేసేందుకు సిద్ధం



ఎమ్మెల్యేకు హారతులు ఇస్తున్న మహిళలు

ఉరవకొండ, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని పెద్ద కౌకుంట్ల గ్రామంలో సోమవారం సాయంత్రం బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని శివాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను తెలియజేశారు. పథకాల వల్ల కలిగే లబ్ధిని వివరించారు. మహిళలు ఎమ్మెల్యేకు హారతులు ఇచ్చి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయా అని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ జనసేన కూటమి విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాసులు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఉరవకొండ, ఫిబ్రవరి5: మండల తహసీల్దారుగా సీకే శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నుంచి శ్రీనివాసులు ఇక్కడికి వచ్చారు.

యల్లనూరు: మండల తహసీల్దార్‌గా జయప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

గుమ్మఘట్ట: మండల తహసీల్దార్‌గా జీ వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కడప జిల్లా నుంచి బదిలీపై వచ్చారు.

బెళుగుప్ప: మండల తహసీల్దార్‌గా ఏ హరనాథ్ రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

బ్రహ్మసముద్రం: మండల తహసీల్దార్‌గా ఈశ్వరయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన జమ్మలమడుగు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

కూడేరు: మండల తహసీల్దారుగా రత్నరాధిక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కర్నూలు జిల్లా నుంచి బదిలీపై వచ్చారు.

పెద్దపప్పూరు: మండల తహసీల్దార్‌గా కుమారస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా నుంచి బదిలీపై వచ్చారు.

రాయదుర్గంరూరల్: రాయదుర్గం మండలం తహసీల్దార్‌గా చిట్టిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిత్తూరు జిల్లా వెంకటగిరికోట నుంచి బదిలీపై వచ్చారు.

కుందుర్పి: మండల తహసీల్దార్‌గా హనుమంతు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా చిత్తూరు నుంచి కుందుర్పికి వచ్చారు.

గుంతకల్లుటౌన్: గుంతకల్లు తహసీల్దారుగా శేషఫణి బాధ్యతలను స్వీకరించారు. కర్నూలు జిల్లా బెలగల్ మండల తహసీల్దారుగా పనిచేస్తున్న శేషఫణిని గుంతకల్లుకు బదిలీ చేశారు.

పామిడి: మండల తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంతకల్లులోని ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి వద్ద రిపోర్టు చేసుకున్నారు.

పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత



రాస్తారోకో చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

ఉరవకొండ, ఫిబ్రవరి 5: మండలంలోని బూదగవి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతపురం, గుంతకల్లు రహదారిపై మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు బైఠాయించి ధర్నా నిర్వహించారు. బాధిత కుటుంబాలు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ప్రమాదానికి కారణమైన వారిని అరెస్ట్ చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాపో యారు. ప్రమాదానికి కారణమైన వారి నుంచి నష్ట పరిహారాన్ని ఇప్పించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులు స్టేషన్‌లోకి చొచ్చుకువెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు స్టేషన్ తలుపులు మూసివేశారు. న్యాయం జరిగేంతవరకూ ఆందోళన విరమించమని తేల్చి చెప్పారు. కారు యజమాని, మృతుడి కుటుంబసభ్యులతో పోలీసులు చర్చించారు. సీఐ తిమ్మయ్య న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

శ్రీనివాసపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీ



చంటిబిడ్డను ఎత్తుకుంటున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, ఫిబ్రవరి5: పట్టణంలోని శ్రీనివాసపురంలో సోమవారం టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే మన, రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీచేశారు.

ఈ డాక్టరమ్మ మాకొద్దు

ప్రభుత్వ వైద్యాధికారి తీరుపై గ్రామస్థుల నిరసన



ఆసుపత్రిలో ధర్నా చేస్తున్న గ్రామస్థులు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 5: ఈ వైద్యాధికారి మాకు వద్దంటూ మండల కేంద్రానికి చెందిన ప్రజలు సోమవారం ధర్నా చేశారు. వైద్యాధికారిణి శ్రీలక్ష్మి విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, ప్రజలకు సరైన వైద్యం అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ వైద్యశాలలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆందోళన నిర్వహించారు. తన చాంబర్ ఎదుటే ఆందోళన చేస్తున్నా వైద్యాధికారిణి శ్రీలక్ష్మి స్పందించకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ స్పందించేంత వరకు కదిలేది లేదని ఆసుపత్రి ఆవరణలో బైఠాయించి వైద్యాధికారితో వాదనకు దిగారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు పచ్చని చెట్ల వల్ల నీడ ఉండేదని వాటిని నరికి వేయడంతో స్థానికులు ఆమె వ్యవహారశైలిపై ఆందోళన చేశారు. జిల్లా వైద్యాధికారిణి దేవికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీలక్ష్మి వైద్యాధికారిణి తమకు వద్దని ఆమెను వెంటనే బొమ్మనహాళ్ నుండి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. చెట్లు నరికివేయడం, విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చింతచెట్లను నరికివేసి అమ్మేయడంపై పయ్యావుల సత్యన్న, నిరంజన్ తదితరులు ప్రశ్నించడంతో ఆమె ఆగ్రహించి మీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని నిర్లక్ష్యంగా ప్రవర్తించడంతో ఆమె వ్యవహారశైలి, మాటతీరుపై మండిపడుతూ ఆందోళనకు దిగారు.

ఆసుపత్రిలో కొనసాగిన ధర్నా సమాచారాన్ని తెలుసుకున్న బొమ్మనహాళ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. పోలీసుల జోక్యంతో ఇంత మంది రావడంతో పొరపాటున మాట్లాడానని శ్రీలక్ష్మి అనడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బసవరాజు, నాగరాజు, కురుబ నాగరాజు రామాంజినేయులు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు

గుంతకల్లు, ఫిబ్రవరి 5: తాము కొని, బండలు పాతిన స్థలాన్ని వైసీపీకి చెందిన కొందరు దౌర్జన్యంగా కబ్జా చేయాలని చూస్తున్నారని పట్టణానికి చెందిన డీ నాగరాజు, బీ వెంకటరాముడు సోమవారం కలెక్టరుకు స్పందనలో ఫిర్యాదు చేశారు. పట్టణంలోని 348-బీ1 సర్వే నెం.లో 35 సెంట్ల స్థలం తమకు చెందినదికాగా, అందులో నాటిన బండలను సీ శివ అనే వ్యక్తి, వైసీపీకి చెందిన మరి కొందరు తొలగించారని ఫిర్యాదుచేశారు. ఈ విషయంగా తమ హక్కు పత్రాలను చూపి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశామన్నారు. రెవెన్యూ అధికారులు వైసీపీ నాయకులకు మద్దతు పలుకుతూ కబ్జాకు సహకరిస్తున్నారని ఆరోపించారు. భూమికి సంబంధించి సర్వే చేయించి భూమి ఎవరిదో మొదట తేల్చుకోవాలని పోలీసులు ఇచ్చిన సూచనను తోసిరాజని, రెవెన్యూ అధికారుల వత్తాసుతో తమ బండలను పగులగొట్టి, వారు బండలు నాటి ఆక్రమిస్తున్నారని పేర్కొన్నారు. సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి: డాక్టర్స్ సెల్



కరపత్రం అందజేస్తున్న పత్తి హిమబిందు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 5: టీడీపీ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తి హిమబిందు పేర్కొన్నారు. మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల గురించి మహిళలకు వివరించారు. మాజీ సర్పంచు రంగారెడ్డి, టీడీపీ నాయకులు నారాయణ, మల్లికార్జున, కదిరెప్ప, జానికి, మాధవి, అరుణ, రాధ, తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలను మాఫీ చేయాలి



డిప్యూటీ తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పామిడి, ఫిబ్రవరి 5: మండలంలోని రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ... 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లో తీవ్ర వర్షాభావం వల్ల అన్ని రకాల పంటలను రైతులు నష్టపోయారన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు పంట పెట్టుబడిని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎకరాకు రూ. 50వేలు కనీసం రూ. 10వేలు ఇవ్వాలన్నారు. కరువు నివారణకు రూ. 10వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్నారు. రైతుల పంట, బంగారు రుణాలు ఒకే సారి మాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అనిమిరెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి మల్లేష్, నాయకులు ఈశ్వరయ్య, బాబాఫక్రుద్దీన్, ఎర్రిస్వామి, ముత్యాలు, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ దుర్భిక్ష జీవన విధానంపై హెచ్చరిక.. 'సాధన'

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 5: రాయలసీమ జీవన విధానం దుర్భిక్ష పరిస్థితులపై ఒక హెచ్చరిక డాక్టర్ శాంతినారాయణ నవల 'సాధన' అని ప్రముఖ సాహిత్య విమర్శకులు నాగేశ్వరచారి అన్నారు. మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖాధిపతి డాక్టర్ కే లక్ష్మీనారాయణ అధ్యక్షతన సోమవారం సాధన పరిచయ సభ నిర్వహించారు. నాగేశ్వరాచారి ప్రధానవక్తగా మాట్లాడుతూ సాధన నవలలో రాయలసీమ, కోస్తా ప్రాంతాల మధ్య జీవన విధానం, ప్రమాణాలలో గల తేడాలను రచయిత శాంతినారాయణ చక్కగా వివరించారన్నారు. రచయిత డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ తన సాహిత్య రచనకు అంకురార్పణ జరిగింది రాయదుర్గంలోని ఉపాధ్యాయులుగా పనిచేసిన కాలంలోనే అన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ బండి నారాయణస్వామి, కవి ఉప్పరపాటి వెంకటేశులు, కళాశాల కమిటీ సభ్యులు బసవరాజు, నారాయణ, అయూబ్‌ఖాన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు

బెళుగుప్ప, ఫిబ్రవరి 5: త్వరలో జరుగనున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ శివ భాస్కర్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన, సీఐ ప్రవీణ్ కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రంను పరిశీలించారు.

చంద్రబాబు హామీలు అద్భుతం

గుంతకల్లు, ఫిబ్రవరి 5: మినీ మేనిఫెస్టోలో టీడీపీ అధినేత చంద్రబాబు పొందుపరచిన సంక్షేమ పథకాలు అత్యద్భుతమైనవని టీడీపీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు టీ కేశప్ప పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని వాల్మీకి సర్కిల్ ఏరియా, 5, 6 వార్డుల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కేశప్ప ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలపై వార్డులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీ సురేంద్ర, కిరణ్, సాగర్, సుధాకర్, మాదన్న, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీఓ

గుత్తి, ఫిబ్రవరి 5: మున్సిపల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి సోమవారం పరిశీలించారు. ఎంఎస్ జూనియర్ కళాశాల, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు పలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో మౌలికసదుపాయాల కల్పనపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మేనేజర్ మురళీధర్, టీపీఎస్ మహబూబ్‌జాన్, ఇమామ్ హుసేన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకపోతే ఎలా బతకాలి?

ఉరవకొండ, ఫిబ్రవరి 5: జీతాలు చెల్లించకపోతే ఏమి తిని బతకాలని ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టు కార్మికులకు ప్రశ్నించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ఏడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా చెల్లించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించేంత వరకూ విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టు కార్మికులు శ్రీనివాసులు, మల్లికార్జున, కేశవ, రామాంజినేయులు. చిన్నబాబు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని బాల వెంకటాపురం గ్రామ సమీపంలో కర్ణాటక నుంచి తరలిస్తున్న అక్రమ మద్యాన్ని సోమవారం అనంతపురం ఇంటెలిజెన్స్, కళ్యాణదుర్గం సెబ్ సిబ్బంది సంయుక్తంగా దాడులు జరిపి పట్టుకున్నారు. ఈ దాడుల్లో 576 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 28800 ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనం, వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో అనంతపురం సెబ్ ఇంటెలిజెన్స్ సీఐ కృష్ణ, కళ్యాణదుర్గం సెబ్ సీఐ యర్ర వెంకట్, సెబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌పై స్పందనలో ఫిర్యాదు

తాడిపత్రి, ఫిబ్రవరి5: స్థానిక మున్సిపల్ కమిషనర్ రవిపై సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ అబ్దుల్‌రహీం, కౌన్సిలర్ రేష్మాపర్వీన్ తదితరులు ఫిర్యాదుచేశారు. సీనియర్ అసిస్టెంట్ చాంద్‌బాషాను రిలీవ్ చేయడంలో కమిషనర్ జాప్యం చేస్తున్నారంటూ కలెక్టర్ గౌతమికి వివరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పుట్లూరు, ఫిబ్రవరి 5: మండలకేంద్రంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. యల్లనూరు మండలం నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌చేసి మైన్స్ అధికారులకు అప్పగించామన్నారు.

బీసీలకే ఎక్కువ శాతం టిక్కెట్‌లు ఇవ్వాలి



అచ్చెన్నాయుడుకు జ్ఞాపికను అందజేస్తున్న జగదీష్

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 5: జిల్లాలో ఎక్కువ శాతం ఎమ్మెల్యే టిక్కెట్‌లను బీసీలకే ఇవ్వాలని విజయవాడలో సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేసినట్లు గుంతకల్లు టీడీపీ సీనియర్ నాయకుడు వసికేరి జగదీష్ తెలిపారు. కురుబలకు ఆరాధ్యదేవుడైన కనకదాసు, పీఠాధిపతి అప్పాజీ గురించి అచ్చెన్నాయుడుకు వివరించామన్నారు. ఈసారి బీసీలకే అత్యధిక టికెట్లను ఇవ్వాలని అధిష్టానం భావిస్తున్నట్లు అచ్చెన్నాయుడు తెలిపారని జగదీష్ తెలిపారు. అచ్చెన్నాయుడుని కలసిన వారిలో వసికేరి పవన్, హనుమంతరెడ్డి, సిద్దు తదితరులు ఉన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ ఏడీఎస్ గౌస్ మృతి



గుంతకల్లు, ఫిబ్రవరి 5: రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ అదనపు కార్యదర్శి మహమ్మద్ గౌస్ (53) సోమవారం గుండెపోటులో మృతిచెందారు. మహమ్మద్ గౌస్ స్థానిక రైల్వే డీజల్ షెడ్‌లో ఇంజనీరుగా విధులను నిర్వహించే వారు. గత సంవత్సరంలో హృద్రోగం రాగా స్టంటు వేయించుకున్నారు. అస్వస్థతగా ఉండటంతో గత శుక్రవారం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సోమవారం మధ్యాహ్నం బైపాస్ సర్జరీ జరగాల్సి ఉండగా, ఉదయమే గుండెపోటుతో మృతిచెందారు. మజ్దూర్ యూనియన్ నాయకులు గౌస్ మరణం పట్ల విచారం వ్యక్తంచేశారు.

తల్లిదండ్రులే నిజమైన హీరోలు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

కుందుర్పి, ఫిబ్రవరి 5: మనందరికీ నిజమైన హీరోలు తల్లిదండ్రులేనని వ్యక్తిత్వ వికాస నిపుణులు లక్ష్మీపురం వేణుగోపాల్ పేర్కొన్నారు. గత నెల 28న మండల వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో 9, 10 తరగతులు చదువుతున్న 750 మంది విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. దీన్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కిష్టప్ప అధ్యక్షతన ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు, వదాన్య జన సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు లక్ష్మీపురం వేణుగోపాల్, ఇన్ఫినిటీ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు బద్దేనాయక్, దుర్గం రక్తదాత సంస్థ అధ్యక్షులు కంబాల తిమ్మారెడ్డి, ఎంఈఓలు ఓబుళపతి, తిప్పేస్వామి, ఎస్టీయు, ఏపీటీఎఫ్ నాయకులు కృష్ణమూర్తి, బొమ్మయ్య, ప్రముఖ సాహితీవేత్త గాయకులు ఆది ఆంధ్ర తిప్పేస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో నమ్మకంతో నిజాయతీ, నిబద్ధత, క్రమ శిక్షణతో తల్లిదండ్రులు, గురువుల ఆశీస్సులతో విజయం దిశగా అడుగులు వేయాలన్నారు. ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు లెనిన్‌బాబు మాట్లాడుతూ కుందుర్పి టాలెంట్ టెస్ట్ నిర్వహణకు సహకరించిన వదాన్య జన ట్రస్టు సభ్యులు అశోక్, వారి బృందానికి, విలువలబడి ఉపాధ్యాయులు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అరుణ, రాము, ట్రస్టు సభ్యులు, విలువల బడి ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించండి

పుట్లూరు, ఫిబ్రవరి 5: మండలంలో ఉపాధిహామీ పథకంలో పనులు ప్రారంభించామని, వాటిలో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఓ చెన్నకేశవులు సోమవారం సిబ్బందికి సూచించారు. మండలవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో పనులు చేస్తున్నట్లు తెలిపారు.